manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 239 | శనివారం | 08.03.2025



# అన్నింటా ఆమె

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహరాణులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సృష్టికి మూలం స్త్రీ.. తల్లిగా.. చెల్లిగా.. అక్కగా.. భార్యగా తనదైన పాత్రను పోషిస్తూనే నారీమణులు అవని నుంచి ఆకాశం వరకు అన్నింట్లో అర్థ భాగాన్ని అందిపుచ్చుకుంటూ రాణిస్తున్నారు. విలక్షణ పాత్రధారిగా వారిని ఎంత కీర్తించినా తక్కువే.. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కొందరు మహిళామణుల కథనాలు మీ కోసం.. - మన చౌరాస్తా, జనగామ

2 లో

# ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

**జనగామ, మన చౌరాస్తా :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సమీకృత జిల్లా అధికారుల కాంప్లెక్స్ భవన సముదాయంలో  జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, లెమనెండ్ స్పూన్, రన్నింగ్ వంటి వివిధ ఆటల పోటీలు నిర్వహించినట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని ఫ్లోరెన్స్ తెలిపారు. ఆటలు పోటీలే గాక వృత్తి రీత్యా వివిధ శాఖలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళ ఉద్యోగులకు ఈ నెల 10వ తేదీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందిస్తామన్నారు.





# హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

- అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్

4 లో






# మహిళా లోకాని ఆదర్శం అక్షిత

- **మహిళా సాధికారత కోసం ఉక్కు సంకల్పం**
- **ఉచిత బ్యూటిషయన్, టైలరింగ్ శిక్షణ**



**సిరిసిల్ల, మన చౌరాస్తా ప్రతినిధి :** మహిళలు వంటింటికే పరిమితం కాకూడదని భావించారు ఓ వైద్యరాలు.. స్త్రీలు వారి కాళ్లపై వారే నిలబడాలనే గట్టి సంకల్పాన్ని తీసుకున్నారు. ఈ క్రమంలోనే 4 వేల నుంచి 5 వేల మంది మహిళలకు ఉచిత బ్యూటిషియన్ శిక్షణ ఇప్పించారు. అంతే కాకుండా మహిళలకు మగ్గం, టైలరిగ్ శిక్షణ నేర్పించి వారు స్వయం సాధికారత సాధించే దిశగా అడుగు వేయించారు. మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడగలిగితేనే వారికి మరింత గౌరవం లభిస్తుందని భావించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు డాక్టర్ కల్లెపల్లి అక్షిత ఉక్కు సంకల్పంతో ముందుకు సాగుతోంది. మహిళా దినోత్సవ సందర్భంగా ఆమె చేస్తున్న సేవలను మరోసారి మహిళాలోకానికి తెలియజెప్పాలనే ప్రయత్నం ఈ కథనం...

### అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్..

డాక్టర్ కల్లేపల్లి అక్షిత రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వ్యక్తి. గత కొన్ని సంవత్సరాలుగా నాడీ వైద్యరంగంలో సేవలందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మొట్టమొదటి నాడీ తెరపిస్టుగా వెస్టన్ అమెరికా యూనివర్సిటీ నుంచి పద్మశాలి ముద్దుబిడ్డ కల్లేపల్లి అక్షిత ఆయుర్వేద డాక్టర్ గా డాక్టరేట్ అందుకున్నారు. కల్లేపల్లి అక్షిత నాడీ వైద్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి గౌరవప్రదమైన డాక్టరేట్ అవార్డును అందజేసి గౌరవంగా సత్కరించారు. ఆమె సేవలకు గాను ఆరు డాక్టరేట్లు, ధనవంతరి నాడీ వైద్యంలో వైద్య విభూషణ్ అవార్డు , ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు, స్వర్ణ నంది అవార్డు, లెజెండ్ అవార్డు, విశ్వవిఖ్యాత, మయూరి అవార్డు, నాట్యమయూరి అవార్డు, సంగీతంలో స్వర్ణ నంది అవార్డులు ఆమె అందుకున్నారు.

### ఓ నారీ శక్తి మేలుకో..!


ఓ మహిళా మణి
నువ్వు లేనిదే సృష్టి లేదు
సృష్టికి ప్రతి సృష్టి నీవు
ఓర్పుకి మార్పుకి
మారు పేరు నీవు

నీయందే ఈ జగత్తు
త్యాగానికి ప్రతీక నీవు
రుద్రవీణ మోగిస్తావు
రుధిర జ్వాల రగిలిస్తావు
ఈ విశాల ప్రపంచంలో
ఓ మహిళా శక్తిగా నిలువు

ఈ జనప్రవాహంలో
ఎన్నో డేగలు పహారా
కాస్తున్నాయి
ఆ డేగల కళ్లు నీపై
పడి భక్షించకుండా
ఓ నారీ శక్తిగా, యుక్తిగా
నిన్ను నీవు మేలుకో..
నీ దయ హృదయంలో
విషాదాన్ని నిండనీయకు..!!



*- మల్యాల జనార్ధనాచారి,*
*పెంబర్తి, 9000585101*



# చంటిపాపతో చెత్తబండిలో...



**ఈ ఫొటోలో చంటిపాపతో చెత్తబండిలో ఉన్న మహిళ పేరు ఆలకుంట రాణి.. జనగామ జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న రాణి సొంతూరు హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌లోని ఒ కాలనీ.. ఈమెకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన ఆలకుంట రమేశ్‌తో మూడేళ్ల కింద పెళ్లయ్యింది. వివాహం అనంతరం ఈ ఇద్దరు దంపతులు జనగామకు వచ్చి చెత్త సేకరణకు ప్రైవేట్ కాంట్రాక్టు తీసుకుని జీవిస్తున్నారు. వీరికి ఐదు నెలల కూతురు ఆరాధ్య ఉంది. అయితే రమేశ్ వృత్తిలో భాగంగా నిత్యం ఉదయాన్నే చెత్త సేకరణ వెళ్లి సమయానికి భోజనం సరిగా లేక రక్తకణాలు తక్కువై అనారోగ్యం బారిన పడడంతో భార్య రాణి ఆయన వృత్తి బాధ్యతను చేపట్టి చేదోడుగా నిలుస్తోంది. తన ఐదు నెలల పాపను ఒడిలో పెట్టుకుని ఆటోలో నడుపుతూ వీధుల్లో చెత్త సేకరణ చేపడుతుంది. ప్రతి నెలా ఒక్కో ఇంటి నుంచి వచ్చే ఆటో ఫైనాన్స్, ఇంటి అద్దె కడుతూ కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నారు. ఇటు అమ్మగా తన పాపను చూసుకుంటూ భార్యగా భర్తకు అండగా నిలిచిన రాణి అందరూ శభాష్ అంటున్నారు.** *- మన చౌరాస్తా, జనగామ*



ఆమె ఓ ఉన్నత శ్రేణి అధికారి అయినా నిరాడంబరంగా.. సాధారణ మహిళగా కనిపిస్తారు. ప్రజలు, తన సహచర ఉద్యోగులకు ఎంతో సింపుల్‌గా కనిపించే ఆమె వృత్తి ధర్మంలో మాత్రం ఎన్నడూ వెనుకడుగు వేయలేదు. పనిలో ఎన్ని వత్తిడిలు ఉన్నా పట్టు వదలకుండా ముందుకు సాగడం ఆమె నైజం.. ప్రభుత్వ ఉద్యోగిగా దాదాపు 37 ఏళ్లుగా సేవలందిస్తూ ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. జనగామ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పనిచేస్తున్న వల్లెం సుహాసినితో మహిళా దినోత్సవం సందర్భంగా 'మన చౌరాస్తా' ముఖాముఖి..

# వారి నైజం మారాలి

### ఆడపిల్లలకు సపోర్ట్ ఇవ్వాలి

- **ఆ మూడు నెలలు ఇబ్బంది పడ్డా..**
- **వృత్తి ధర్మంలో వెనుకడుగు వేయను**
- **జనగామ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వల్లెం సుహాసిని**



**మన చౌరాస్తా :** మేడం నమస్తే.. చాలా సింపుల్‌గా ఉండే మీరు చాలా మందికి తెలియదు. మీ గురించి చెప్పుకోవాలంటే..!

**సుహాసిని :** నమస్తే అండీ.. నా పేరు వల్లెం సుహాసిని. ఊరు కాజీపేట, హనుమకొండ జిల్లా. నేను బీఏ (ఆర్ట్స్) చదివాను. మా ఆయన సారంగపాణి. ఆయన పరకాల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లైబ్రేరియన్‌గా పనిచేశారు. ఇప్పుడు లేరు. 2008 లో మరణించారు. మాకు ఒక పాప మోక్షిత. తను బీకాం (సీఏ) చదువుతోంది.

**మన చౌరాస్తా :** మీకు ఉద్యోగం ఎప్పుడు వచ్చింది?

**సుహాసిని :** 1987 లో జూనియర్ అసిస్టెంట్‌గా వరంగల్ కలెక్టర్ ఆఫీస్‌లో పనిచేశా. తరువాత సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్, డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్ వచ్చింది.

**మన చౌరాస్తా :** మీ వృత్తిలో గుర్తుండిపోయే ఘటనలు ఏమైనా ఉన్నాయా?

**సుహాసిని :** కరోనా టైంలో తహశీల్దార్‌గా ఉన్నప్పుడు వేరే స్టేట్ లేదా ఫారిన్ నుంచి వచ్చిన వాళ్లకు స్టాంపింగ్ వేయడం. వాళ్లను క్వారంటెన్‌లో ఉంచి, వాళ్లకు మెడికల్ అసిస్టెన్స్, ఫుడ్, అన్ని వసతులు అందించడం. ఇక భారీ వర్షాల వలన ఇళ్లు కూలి పోయిన వారికి టెంపరరీ షెల్టర్లు ఏర్పాటు చేసి, వాళ్లకు వసతులు ఏర్పాటు చేయడం చాలా సంతృప్తిని ఇచ్చింది.

**మన చౌరాస్తా :** మీ జర్నీలో ఏమైనా ఒడిదుడుకులు ఉన్నాయా?

**సుహాసిని :** మా వారు 2008లో చనిపోయినప్పుడు మా పాపకి మూడేళ్లు. నాకు అదే టైంలో ఖమ్మం జిల్లాకు ఎలక్షన్ ట్రాన్స్ ఫర్ అయ్యింది. ఎలక్షన్ టైం సెలవు పెట్టలేం.. మా పాపని వదిలి డ్యూటీ చేశాను. మూడు నెలలు చాలా సఫర్ అయ్యాను. మా అక్క, బావ వాళ్ల సపోర్ట్ తోనే నేను అక్కడ పని చేయగలిగాను. ఆ ఒక్క ఇన్సిడెంట్ నన్ను.. నా ఈ జర్నీలో చాలా బాధ పెట్టింది. అది తప్ప నా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించడానికి నేను ఎప్పుడూ వెనుకాడలేదు.

**మన చౌరాస్తా :** మీ ఆత్మీయులు..

**సుహాసిని :** నా ఫ్యామిలీ మెంబర్స్.

**మన చౌరాస్తా :** మహిళా దినోత్సవం సందర్భంగా ఏమైనా చెబుతారా..!

**సుహాసిని :** తల్లిదండ్రులు ఆడపిల్లని బాగా చదివించి, తన కాళ్ల తాను మీద నిలబడేలా సపోర్ట్ చేయాలి. ఇప్పటికీ చాలా మంది 'ఆడపిల్ల ఈడపిల్ల కాదు' అంటూ వారిని ఎదగకుండా చేసేవాళ్లు ఉన్నారు. అలాంటి వాళ్లు ఇప్పటికైనా మారాలి. స్త్రీ శక్తి ప్రపంచానికి వెలుగునిస్తుంది. మహిళల ధైర్యం, సహనం, ప్రేమ, త్యాగం ప్రతి రోజు స్ఫూర్తిదాయకమే. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

## ఆమె

సగం కాదు
ఆమె అనంతం
ప్రాణానికే
ప్రాణం పోసిన
ఆదిశక్తి!

మన నడతకు
నడకలు నేర్పిన
ధీశక్తి
మన చదువుల
సర్వస్వం ఆమే!

భూగోళం చుట్టి
గ్రహాంతరాలు గెలిచి
ఉదయాన్ని
నిద్రలేపినా
ఆమెకు సాటి
ఎవరూలేరు!

మానవతను
కలగంటూ
మనిషిని నిర్మిస్తుంది
తరాన్ని సృష్టిస్తుంది!

అంతరాల
అలలు ఆమెకు తెలియవు
ఆత్మీయత అనుబంధం
ఆమె రెండు కళ్ళు!

మనకో ప్రపంచాన్ని
ఇచ్చేసి సాదాసీదాగా
మనముందే తిరుగుతుంది
భూగోళంలా!

దేవతలకోసం వెతికే
అమాయకులం మనం
అమ్మతనానికి
మొక్కులు చెల్లించలేనివాళ్లం

ఓ నిశ్శబ్ద కాంతితరంగం
ఆ అద్వితీయ అంతరంగం
మన వారసత్వ సంపద

ఆమె ను కాపాడుకుందాం!
అమ్మకు మొక్కుకుందాం!



- పానుగంటి రామమూర్తి
జనగామ , 9490109599

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**జనగామ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి**



**చేర్యాల, మన చౌరాస్తా :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి పేదల కల నెరవేరుస్తామని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామములో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాంపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నందున గ్రామములోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్మా ఆగం రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజ మల్లేశం, చేర్యాల మండల,పట్టణ అధ్యక్షులు కొమ్మురవి, దాసరి శ్రీకాంత్, పిఎసిఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందీగా రాకేష్ కృష్ణ, అందె నాని బాబు, కర్క సంతోష్ రెడ్డి, భూమని బాలరాజు, బండారు కనకయ్య, రంగు శివ శంకర్, రంగు తిరుపతి, ఆకుల రాజు, మేడి చెల్మి రాకేష్ పాల్గొన్నారు.



## హైమాస్ట్ లైట్లు ప్రారంభం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలం మరిగడిలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి నిధుల నుంచి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పర్శరములు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాష్ యాదవ్, నాయకులు చిరంజీవి, శ్రీహరి, చికుడు వెంకటేష్, నాగరాజ్, బనుక ప్రభాకర్, కమలాకర్, రఘు, పృథ్వీరాజ్, అరవింద్, రాజు పాల్గొన్నారు.

## మల్లన్న హుండీ ఆదాయం రూ.69.11 లక్షలు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపులు జరగగా 15 రోజుల హుండీ ఆదాయం 69 లక్షల 11వేల 633 రూపాయల నగదు సమకూరినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. నగదుతో పాటు 46 గ్రాముల మిశ్రమ బంగారం, 5 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి, 14 విదేశీ కరెన్సీ నోట్లు, 15 క్వింటాల మిశ్రమ బియ్యం లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ డివిజన్ ఇన్స్పెక్టర్ వి. రంగారావు, ధర్మకర్తలు కాయిత మోహన్ రెడ్డి, వలాద్రి అంజిరెడ్డి, చిగిరి కొమురయ్య, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, టిజిబి బ్యాంకు సిబ్బంది, శివరామ కృష్ణ భజన మండలి సేవా సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు నాగపురి విద్యార్థి



**చేర్యాల, మన చౌరాస్తా :** బీహార్ రాష్ట్రంలో మార్చి 29న జరగబోయే 39వ జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తుమ్మ బాలు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలుకట్టే ఐలయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, పద్మ, మనోజ్ కుమార్, నిరుపమ, విజయ్ కుమార్, ప్రకాశ్ రెడ్డి, మాధవి, యాదగిరి, స్వర్ణ కుమార్, కనక లింగం, రాజేశ్వరి, ఫహీం సుల్తానా, ఉమర్ స్వామి, తదితరులు విద్యార్థిని అభినందించారు.

## హాస్టల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలును శుక్రవారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి వసతులు కల్పనను పర్యవేక్షించారు. నీటి వృథా అరి కట్టాలన్నారు. పాఠశాల ఆవరణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని నిర్వహణ అధికారులను ఆదేశించారు. వంటగదిని సందర్శించి పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పాఠశాల మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేసి సత్వరమే నివేదిక అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టరు వెంట ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రాములు, కళాశాల ప్రిన్సిపాల్, ఇంజనీరింగ్ ఉన్నారు.

## వరంగల్ సీపీగా సన్ ప్రీత్ సింగ్




**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ 2011 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన వారు. 2012లో ములుగు ఏఎస్పీ, వరంగల్ రూరల్ ఓఎస్డీగా పని చేశారు. అనంతరం ఎల్‌బీ నగర్ డీసీపీగా, జగిత్యాల ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం వరంగల్‌లో సీపీగా ఉన్న అంబర్ కిషోర్ ఝాను రామగుండం పోలీస్ కమిషనర్‌గా వెళ్లగా ఆయన స్థానంలో సన్ ప్రీత్ సింగ్ బదిలీపై ఇక్కడకు రానున్నారు.



## ఘనంగా స్వయంపాలన దినోత్సవం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ఎంపీపీఎస్ ఇటికాలపల్లి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఈవోగా జే యశ్వంత్, హెచ్‌ఎంగా డి.నవ్య వ్యవహరించారు. ప్రథమ బహుమతి శిరీన్, ద్వితీయ బహుమతి రెహాన గెలుపొందారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఇర్రి వెంకట్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ సతీష్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.ఆంజనేయులు, టీచర్లు ఎస్.వెంకటేశ్వర్లు, రాధ, విజయలక్ష్మి, మదూరి వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే పల్లా

**చేర్యాల, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటి పరిష్కార దిశగా ముందుకు సాగుతున్నారని చేర్యాల మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, నాగపురి గ్రామ మాజీ సర్పంచ్ కరుణాకర్ అన్నారు. ఎంజీఎన్ఆర్ఇజిఎస్ నిధుల కింద మంజూరైన ఐదు లక్షలు, నియోజకవర్గ రూరల్ రోడ్స్ కింద మంజూరైన పది లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం వారు భూమి పూజ చేసి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్య, విద్యా ప్రదాతగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నాడని అన్నారు. నాగపురి గ్రామ ప్రజల కోరిక మేరకు 15 లక్షల రూపాయల విలువైన సిసి రోడ్లను మంజూరు చేయించిన ఎమ్మెల్యే కు గ్రామ ప్రజల తరపున వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీఐ, ఎస్సై

**చేర్యాల, మన చౌరాస్తా :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాలను శుక్రవారం రోజున చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై ని రేష్ సందర్శించారు. ఈ సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని అన్నారు. ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు.



# రెడ్ డ్రెస్‌లో శృతిహాసన్

అందాల ముద్దుగుమ్మ స్టార్ సీనియర్ హీరో కుమార్తె శృతిహాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అనగనగా ఓ ధీరుడు సినిమాతో చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ, అనతికాలంలోనే స్టార్ స్టేటస్ అందుకుంది. ఈ మూవీ తర్వాత శృతిహాసన్ చేసిన ప్రతీ సినిమా హిట్ అందుకుంది. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన గబ్బర్ సింగ్ సినిమాలో నటించి ఈ బ్యూటీ మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమా తర్వాత ఈ అమ్మడుకు అనేక అవకాశాలు వచ్చాయి. వచ్చిన ప్రతి ఆఫర్‌ను అందిపుచ్చుకొని, స్టార్ హీరోయిన్‌గా టాలీవుడ్‌నే షేక్ చేసింది ఈ బ్యూటీ. ఇక రీసెంట్‌గా ప్రభాస్ సలార్ మూవీలో నటించి పాన్ ఇండియా స్టార్ అయిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు నాలుగు సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ వరస ఫొటో షూట్స్‌తో తన అభిమానుల మనసు దోచేస్తుంటుంది. తాజాగా ఈ చిన్నది రెడ్ కలర్ డ్రెస్‌లో తన అందాలతో కుర్రకారుకు విందు భోజనం పెట్టింది. ఎప్పుడూ, ఎక్కువగా బ్లాక్ డ్రెస్‌లో కనిపించే ఈ బ్యూటీ.తాజాగా రెడ్ కలర్ డ్రెస్‌లో పలు ఫొటోలకు ఫోజులిచ్చింది. అందులో శృతిహాసన్ చాలా అందంగా కనిపించింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక నటనతోనే కాకుండా శృతిహాసన్ సింగర్‌గా కూడా తన సత్తాచాటుతోంది. చాలా సినిమాల్లో ఈ బ్యూటీ పాటలు పాడి, తనకంటూ ఓ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది.